కథ

# లైఫ్..!

ఆర్. మధుసూదనరావు

'వినీ...'

ఎక్కడో విన్న స్వరం...

ఆర్ద్రంగా...ఆత్మీయంగా...లాలనగా...

సుదూర తీరాల నుంచి అలలా సాగి చెవులకు తాకుతున్నట్లు...

కళ్లు తెరవాలని ఎంతగా ప్రయత్నిస్తున్నా...టన్నుల కొద్ది బరువు రెప్పల్ని అదిమిపెడుతున్న ఫీలింగ్..!

ఏమైందినాకు...అంతా స్పష్టాస్పష్టం...మళ్లీ అదే పిలుపు...

ఈసారి శక్తినంతా కూడదీసుకుని కళ్లు తెరిచా.

ఎదురుగా నాన్న, అమ్మ, చెల్లి...నా చిన్నారి హరిణి. మసక మసకగా కనిపిస్తున్నారు. ఏవిటీ ఏమైంది? అందరూ ఒక్కచోటే ఇలా దిగాలుగా నిలుచున్నారెందుకు?..ఇంతలో ఓ ఆత్మీయ స్పర్శ...అవని...ఎస్ ఎక్కడున్నా ఇట్టే తన ఉనికిని చెప్పగల శక్తి ఆ స్పర్శకుంది. అంటే ఇందాక తనను పిలిచింది కూడా అవనే! 'హలో అందరూ బైటికెళ్లండి... పేషంట్‌కు రెస్ట్ అవసరం...' నర్స్ అనుకుంటా, మళ్లీ కళ్లు మూతపడిపోతున్నాయి. మెదడులో మళ్లీ మళ్లీ అదే దృశ్యం. సరిగ్గా 24 గంటల క్రితం...

నిన్న...నాకు ఓ చీకటి దినం. జీవితంలో అనుకోని మలుపులు ఎంత భయంకరంగా ఉంటాయో అప్పుడే తెలిసింది. సాయంత్రం 4గం. కాగానే టీ బ్రేక్‌లో అందరం పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాం. ఇంతలో టీం మేనేజర్ నుంచి ఫోన్. 4.30 గంటలకు అర్జెంట్ మీటింగ్ ఉందని. 'అంత కొంపమునిగే విషయమేంటో''...ఓ జోక్ పేలింది. కానీ మీటింగ్ ప్రారంభమైన పది నిమిషాలకే అసలైన ఆటంబాంబు పేలింది. దాదాపు పాతికమందిని ఇంటికి పంపించక తప్పడం లేదని అధికారులు చెప్పారు. అందుకు దారితీసిన పరిస్థితుల్ని క్లుప్తంగా వివరిస్తూ...మళ్లీ అవసరం ఉంటే తప్పకుండా మీకే అవకాశం కల్పిస్తామన్న హామీతో ముగించారు. ఆ తర్వాత మా టీం మేనేజర్ నన్ను పక్కకు పిలుచుకెళ్లాడు. "వినీల్ యు ఆర్ జెమ్! నీలాంటి వాళ్ల కోసమే ఎన్నో కంపెనీలు రెడ్ కార్పెట్ వెల్కం చెబుతున్నాయి. లిస్టులో నీపేరు ఉంటుందని నేను అనుకోలేదు... అయాం రియల్లీ సారీ!'' ఒక్కసారిగా షాక్ తగిలినట్లయ్యింది. ఉద్యోగం పోయిందన్న విషయాన్ని అతను ఎంత డిప్లొమేటిక్‌గా చెబుతున్నా... నాకళ్లు బైర్లు కమ్మసాగాయి. ఉన్నట్టుండి ఇలా...ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. కాసేపయ్యాక ఆఫీసులో వార్త పాకిపోయింది. అయితే ఎవరూ ఏం మాట్లాడలేదు. కొంతమంది చూపుల్లో రేపు మన వంతు కాదుకదా అన్న భయం. కంపెనీ బహుకరించిన కవర్ తీసుకుని నెమ్మదిగా కదిలాను. ఇంటికెళ్ల బుద్ధి కాలేదు. ఏవేవో ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే పరధ్యానంగానే పబ్‌కు కారు మళ్లించాను.

× × ×

నేను చాలా అనార్గనైజ్డ్. నా జీవితాన్ని దగ్గర నుంచి చూసిన ఎవరికైనా అతి తక్కువ సమయంలో అనిపించే ఫీలింగ్ కూడా ఇదే. అందుకే ఫ్రెండ్స్, బంధువులు...చివరికి శ్రీమతి కూడా నేను ఓ పట్టాన అర్థం కాననే అంటుంటారు. పదేళ్ల కిందట అప్పటి ట్రెండ్‌కు అనుగుణంగా ఎంసీఏ చేశాను. వెంటనే ఐటీ కంపెనీలో ఉద్యోగం. మధ్యతరగతి కుటుంబ వారసుడిగా ఎదిగిన నాకు ఉద్యోగం పూలబాటే పరిచింది. వారానికి ఐదురోజులు పని, వీకెండ్ విహారాల సందడి, మార్కెట్లో కనిపించిన ప్రతి వస్తువు కొనేయడం, ఉద్యోగ రీత్యా ఓ రెండుసార్లు అమెరికా వెళ్లి రావడం... ఎక్కువ జీతం కోసం డిమాండ్ చేసి ఉద్యోగాలు మారడం అన్నీ గొప్పగా అనిపించే సందర్భాలేగా! ఏ ఫంక్షన్‌కు వెళ్లినా సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నన్ను, నా కుటుంబాన్ని ఎలివేట్ చేసిన సంఘటనలు ఎన్నో! ఇక జీవితమంటారా హ్యాపీ అండ్ కూల్. త్రిబెడ్‌రూమ్ ఫ్లాట్, అధునాతన ఫర్నీచర్, కార్. చీకూ చింత లేని కుటుంబం. ఎందుకోగానీ షాపింగ్ నా అబ్సెషన్‌గా మారిపోయింది. మార్కెట్‌లో ఏ కొత్త వస్తువు కనిపించినా ఇంట్లో ఉండాల్సిందే. బహుశా సర్దుబాటే లక్ష్యంగా మధ్య తరగతి కుటుంబములో పుట్టి పెరగడం వల్లనేమో అవకాశమున్నప్పుడు లగ్జరీగా బతికేయాలన్న ఫిలాసఫీ ఏర్పడింది. మన సరదాలు, కలలు అన్నింటినీ ఫ్రూట్‌ఫుల్ చేసుకోవాలన్న ఆరాటం నా ప్రతి ఖర్చులో

కనిపించేది. మా కలల పంట హారిణి ఫస్ట్ బర్త్‌డే స్టార్ హోటల్లో సెలబ్రేట్ చేసినపుడు వచ్చిన వాళ్లలో సగం మంది ఈర్ష్య పడ్డారని తెలిసి ఏదో తెలీని ఇగోతో ఆనందం. ఇంత లగ్జరీగా ఉంటున్నా అవని ఎందుకని గానీ, కావాలని గానీ బైటికి చెప్పేది కాదు. సరే తాను ఎక్స్‌ప్రెసివ్ కాదులే అనుకుని సరిపెట్టుకునే వాణ్ణి. హారిణి పుట్టగానే పెద్ద కాన్వెంట్‌లో చేర్పించాలని ఆరా తీసినపుడు మాత్రం అవని 'మీకెప్పుడూ తొందరే' అంటూ చిరునవ్వుతో అంది. అయితే అది కామెంటో కాంప్లిమెంటో నాకిప్పటికీ అర్థం కాలేదు. కానీ నాకు మాత్రం ఆ క్షణాన చిన్నప్పుడు స్కూల్ బ్యాగు కోసం ఏడాదిపాటు టైలర్ చుట్టూ తిరిగిన సంఘటన కదలాడింది. ఎందుకురా దుబారా చేస్తావ్...అని అమ్మా, నాన్న చిన్నగా సణిగేవారు. సాఫీగా సాగిపోతోందనుకుంటున్న సమయంలో ఊహించని మలుపు... పెద్ద కుదుపు..!

× × ×

రెసెప్షన్...పింక్ స్లిప్...

ఐటీ ఉద్యోగుల్ని కుదిపేస్తున్న పదాలు. అమెరికా ఆర్థికమాంద్యం సెగతో ఇక్కడా ఉద్యోగుల ఉద్వాసన పర్వం మొదలైంది. పులిమీద పుట్రలా సత్యం ఎపిసోడ్...మీడియాలో వైల్డ్ పబ్లిసిటీ...చివరికి టీవీల్లో మ్యారేజ్ బ్యూరో వాళ్ల నోటివెంట డిమాండ్ తగ్గిందన్న డైలాగ్‌లు...నిజం చెప్పొద్దు పరమ చిరాగ్గా ఉండేది. ఏడ్చేవాళ్లు ఎలాగూ ఏడుస్తారు. తప్పదు... వీరికేంటో ఈ కిరాతకానందం. కానీ ఏం చేద్దాం నౌ ఇటీజ్ అవర్ టర్న్, వుయ్ హావ్‌టు బేర్! వారం కిందట క్లోజ్ ఫ్రెండ్ శ్యామ్ జాబ్ పోయింది. ఎక్కడ డిప్రెస్ అవుతాడోనని మాటలతో కూల్ చేశా. కానీ విచిత్రం ఏంటంటే ఇన్ని జరుగుతున్నా నా విషయంలో మటుకు చాలా కాన్ఫిడెంట్‌గా ఉండేవాణ్ణి. ప్రాజెక్ట్ ముగిసి వారం రోజులైంది. ఎక్కడ బెంచ్‌మీద ఉండాల్సి వస్తుందేమోనని భయపడ్డా...కొత్త ప్రాజెక్టు వస్తోందని, అయినా నీకేం తక్కువ యూ ఆర్ జెమ్ అంటూ టీం మేనేజర్ అప్రైజ్ చేయడంతో రిలీఫ్‌గా ఫీలయ్యాను. ఇదంతా జరిగి మూడురోజులైనా కాలేదు. ఉన్నట్టుండి ఈ దుర్వార్త. నేను కూడా పింక్ పేస్లిప్ అందుకోవాల్సి వస్తుందని కల్లో కూడా అనుకోలేదు.

× × ×

పబ్‌లో అడుగుపెట్టగానే, బేరర్ చిరపరిచిత మైన నవ్వు. నిమిషాల్లో సర్వ్ చేశాడు. గ్లాసులో ద్రవం గొంతులో దిగే కొద్దీ ఆలోచనల వేగం పెరుగుతోంది. ఎంత ఆలోచించినా చివరికి అక్కడే ఆగిపోతోంది... ఎందుకిలా?... ఇప్పుడెలా? శ్యామ్‌కు ధైర్యం చెప్పిన నేనేంటి ఇలా అనిపించింది. డామిట్ నా వాట్‌టుడూ... డెబిట్ కార్డులు, నెలనెలా కట్టాల్సిన ఈఎంఐలు గుర్తుకొస్తున్నాయి. వారం కిందట మావయ్య వద్ద చేబదులుగా తీసుకున్న లక్ష రూపాయలు, చెల్లి పెళ్లికి నాన్న వద్దంటున్నా ఒప్పుకున్న భారీ కట్నం...అన్నీ ఒకటొక్కటిగా కదలాడుతున్నాయి. అన్నిటికీ మించి బంధువుల హావభావాలు కనిపిస్తున్నాయి. నెల్నాళ్ల నుంచే అడపా దడపా ఫోన్లు వస్తున్నాయి. నాలుగు కుశల ప్రశ్నలు...ఆ తర్వాత...ఏరా నీకేం పర్వాలేదుగా అన్న ఆరా! ఆ ఆరాలో కూడా ఆందోళన కన్నా ఇంకెన్ని రోజుల్లో అన్న అర్థమే ధ్వనించేది. అప్పట్లో నవ్వుకునే వాణ్ణి. ఇప్పుడెలా? రేపట్నుంచి ఇంట్లోనే ఉండాలా! అవని ఎలా రియాక్ట్ అవుతుందో? అమ్మా నాన్నలు...చెల్లి కళ్లల్లో ఆందోళన...చాలా చాలా దూరం ఆలోచిస్తున్నానని తెలుస్తోంది. ఊహలు ఒత్తిడి పెంచుతున్నాయి. బేరర్ సార్...అంటూ ఆగాడు. డోస్ ఎక్కువవుతోందని కాబోలు...కానీ మరో రెండు పెగ్‌లు లాగించా. గుండె నిండా గుబులు...చాలా సేపు స్పెండ్ చేసినా ఆందోళన తగ్గలేదు. తక్షణ పరిష్కారంగా ఏదో చేసేస్తే బాగుంటుందనిపిస్తోంది. ఉద్యోగం ఊడిందనే కాదు...రేపటి ఉదయాన్ని ఎలా ఎదుర్కోవాలనే బాధ గుండెను ఈతముల్లులా గుచ్చుతోంది. బిల్లు పే చేసి బైటికి నడిచా. చాలా పొద్దు పోయినట్టుంది. నల్లటి తాచులా మెలితిరిగిన రోడ్డు నియాన్ కాంతుల్లో మెరుస్తోంది. కారు మెల్లగా కదులుతోంది. అందరికీ జరిగింది... జరుగు తున్నది... నాకు జరిగింది అంతేగా వాట్ ఎల్స్ రాంగ్! అనిపించినా ఆలోచనలైతే ఓ పట్టాన వదలనంటున్నాయి. ఉన్నట్టుండి ఎదురుగా శరవేగంతో ఓ లారీ దూసుకొచ్చింది. వెంటనే స్టీరింగ్ తిప్పాను. చిన్నపాటి అదురు. ఆ క్షణంలో యాక్సిడెంట్ అయితే ఎంత బావుణ్ను అనిపించింది. ఎలాగైనా సమస్య ఈ రాత్రికే పరిష్కారం కావాలి...అంతకంతకు పెరుగుతన్న ఆవేశం...డాష్ బోర్డు పై ఉన్న టాబ్లెట్లపై దృష్టిపడింది. అమ్మకోసం కొన్న నిద్రమాత్రలు. ఆ క్షణాన మనసు వశం తప్పింది. వెంటనే స్ట్రిప్ చించి మాత్రలు వేసుకుని గడగడా నీళ్లు తాగేశాను. ఒక్కసారిగా తల గిర్రున తిరుగుతున్న ఫీలింగ్! ఎలాగోలా ఇల్లు చేరుకుని బెల్ కొట్టగానే తలుపు తెరుచుకుంది. ఎదురుగా అవని...అంతే గుర్తు! ఇప్పుడిలా హాస్పిటల్‌లో బెడ్‌పై నిస్త్రాణంగా. క్రమంగా నిద్ర కమ్మేసింది.

× × ×

వినీల్ కళ్లు తెరూ...

అవని గొంతు వినిపించి లేచా. కాస్త తేరుకున్నట్టనిపిస్తోంది. పక్కనే కూర్చొన్న తనని చూడాలంటేనే సిగ్గేస్తోంది. క్షణం తర్వాత...

'...వనీ...ఐయం సారీ! నా గొంతు నాకే చిత్రమనిపించింది.

'వినీల్...డోంట్ వరీ! వుయ్ ఆర్ లక్కీ!' మెల్లగా పలికింది.

నిమిషం తర్వాత అవనే మాట్లాడింది...

'వినీల్ ఎన్నో విషయాల్లో నాకంటే నీవు బెటర్‌గా ఆలోచిస్తున్నావ్. అందుకే నిన్ను హార్ట్‌ఫుల్‌గా ట్రస్ట్ చేస్తున్నాను. బిలీవ్‌మీ ఇప్పటికీ..! జాబ్ పోవడమనేది నిజంగా లాస్! కాదనను. కానీ వెళ్లిపోదామనుకున్నావు చూడు...అదే నన్ను బాధపెడుతోంది. ఎందుకిలా చేశావని అడగను కానీ...ఇలా చేయాలని ఎందుకనిపించిందో నాకర్థం కావడం లేదు. నీ ఫ్రెండ్ శ్యామ్ విషయంలోనూ ఇదే జరిగింది. అప్పుడు ఎంత ధైర్యంగా కౌన్సిల్ చేశావు. వినీ మరి ఇప్పుడెందుకిలా...' ఆ మాట అంటుంటే కళ్లలో కన్నీటి పొర కదలాడింది.

అవని అలా అడుగుతుంటుంటే ఏం మాట్లాడను? ఛా ఎంత తప్పు చేశానో తెలుస్తోంది. మౌనంగా ఆమె చెయ్యి పట్టుకున్నాను. కొన్ని సందర్భాల్లో మౌనం మించిన సమాధానం ఉండదేమో!

'...వినీల్ గతం మరచిపోదాం. ఇకపై ఈ టాపిక్ మన మధ్య అస్సలు రాదు ఓకే! మన కోసం జీవితం ఎదురుచూస్తోంది. ఇప్పటిలా లగ్జరీగా బతకలేకపోవచ్చేమో...కానీ హాపీగా ఉందాం. ఇల్లు, కారు, సోషల్ స్టేటస్, అప్పులు ఇవేగా సమస్యలు. కలిసి వర్కవుట్ చేద్దాం. ఇక్కడ ఇబ్బంది అనిపిస్తే వేరే ఊరికి వెళ్లిపోదాం. మనమంటే ఎవరో తెలీని వాళ్ల మధ్య కొత్త బతుకు ప్రారంభిద్దాం. వినీల్ నీవు ఒంటరివి కాదు. అత్త, మావయ్య, నీ చెల్లెలు, హరిణి నేనూ అందరం నీవెంట ఉన్నాం! ఆమె స్వరంలో ఎంతో ఓదార్పు కనిపించింది. నిజవే ఇన్ని బంధాలను ఎలా కాదనుకోగలిగాను. అవని ఎక్స్‌ప్రెసివ్ కాదనుకున్నాను గానీ ఎంత గాఢంగా ఆలోచిస్తుందో ఇప్పుడే అర్థమవుతోంది. ఒక్క అవనే కాదు...జీవితం, అనుబంధం, సమాజం అన్నీ అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది. 'వినీల్...నీకు క్రికెట్ అంటే ఇష్టం కదూ. ఓ విషయం చెప్పనా క్యాచ్ మిస్ అయితే బ్యాట్‌మన్‌కు లైఫ్ అంటారే. నీకు కూడా ఇప్పుడో లైఫ్ వచ్చింది. మళ్లీ ఆడటానికి బీ రెడీ 'అంది నవ్వుతూ.

అవని ఇచ్చిన కాఫీ సిప్ చేశా!

ఎప్పుడూ ఇంత రుచి అనిపించలేదు. తృప్తిగా కళ్లు మూసుకున్నాను.

మరో కొత్త జీవితాన్ని అందంగా స్వప్నించేందుకు!!